www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 19 జనవరి 2023



పెన్షనర్లు ఆందోళన చెందొద్దు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఇకెవైసి వల్ల పెన్షనర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భీమవరం సబ్ ట్రెజరీ అధికారి రవివర్మ అన్నారు. భీమవరం రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ భవనంలో బుధవారం ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన ఇకెవైసి నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవివర్మ మాట్లాడారు. ఇకెవైసి నమోదులో పెన్షనర్లు ఆందోళన చెందుతున్నారని, నమోదుకు ఇంకా సమయం ఉందన్నారు. ఆధార్‌కు ఫోన్ నెంబరు లింక్ అయి ఉండాలని, లేకపోతే సరిచేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గీతల జేమ్స్, కార్యదర్శి ఎస్ఎన్.రాజు, ఉపాధ్యక్షులు అప్పలరాజు, అధ్యాపకుల అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణరాజు, భీమవరం తాలూకా కార్యదర్శి సీతారామరాజు, పెన్షనర్లు పాల్గొన్నారు.

3ఎఫ్ ఇండస్ట్రీస్‌లో మరో ఘోరం


ఫ్యాక్టరీలోని బాయిలర్

బాయిలర్‌లో జారి మహిళా కూలీ మృతి
బంధువుల ఆందోళన
రూ.18 లక్షల పరిహారం, అల్లుడికి ఉద్యోగం ఇచ్చేందుకు హామీ


మృతిచెందిన వెంకటరమణ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం/పెంటపాడు

పెంటపాడు మండలం ప్రత్తిపాడులోని ఫుడ్ ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీ(ఎఫ్ఎఫ్ఎఫ్)లో నెలరోజుల క్రితం (డిసెంబర్ 21న) జరిగిన అగ్నిప్రమాదంలో ఒకరు సజీవదహనమై, నలుగురు తీవ్రంగా గాయపడిన ఘటన మరువకముందే మరో ప్రమాదం భయభ్రాంతులకు గురిచేసింది. ఫ్యాక్టరీలోని బాయిలర్ కన్వేయర్‌లో జారి ఓ మహిళా కూలీ బుధవారం ప్రాణాలు కోల్పోయింది. దీంతో ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కృష్ణయ్యపాలేనికి చెందిన దేవెళ్ల వెంకటరమణ(55) 15 సంవత్సరాలగా ఫ్యాక్టరీలో రోజువారీ కూలీగా పనిచేస్తోంది. ఎప్పటిలాగానే ఉదయం ఫ్యాక్టరీలో పనికివెళ్లింది. బాయిలర్ కన్వేయర్ వద్ద ఊక వేస్తుండగా అందులోకి జారిపోయింది. ఈ ఘటనలో ఆమె శరీరం పూర్తిగా కాలిపోయి మృతిచెందింది. వెంకటరమణ భర్త రెండేళ్ల క్రితం మృతిచెందాడు. ఈమె ఇద్దరు కుమార్తెలకూ వివాహాలు జరిగాయి. చిన్నకుమార్తె భర్త ఇదే ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు.

ఫ్లాట్‌ఫారం లేకపోవడం వల్లే..

ఫ్యాక్టరీలో వెంకటరమణ పనిచేసే చోట ఫ్లాట్ ఫారం ఉండాలి. అది లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని కార్మికులు చెబుతున్నారు. కార్మికుల పట్ల ఫ్యాక్టరీ యాజమాన్యం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

బంధువుల ఆందోళన


వెంకటరమణ కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు ఫ్యాక్టరీ ఎదుట ఆందోళనకు దిగారు. న్యాయం చేసేవరకూ ఆందోళన విరమించేది లేదంటూ భీష్మించారు. వీరికి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఐఎఫ్‌టియు నాయకులు ప్రసాద్, రాంబాబు, వైసిపి నాయకులు వీర్ల గోవిందరావు, జి.సాంబయ్య మద్దతు తెలిపారు. ఈ ఆందోళనకుదిగొచ్చిన యాజమాన్యం కుటుంబ సభ్యులు, నాయకులతో చర్చలు జరిపారు. మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.18 లక్షల నష్టపరిహారం, చిన్నల్లుడు వల్లూరి శ్రీనివాస్‌కు ఫ్యాక్టరీలో ఉద్యోగం ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించింది.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

భీమవరం : ఫుడ్ ఫ్యాట్స్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో జరిగిన ప్రమాదాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గత ప్రమాదాన్ని మరిచిపోకముందే మరో ప్రమాదం జరగడం, కార్మికురాలు మృతి చెందడం యాజమాన్యం వైఫల్యంగా భావించాలని స్పష్టం చేసింది. దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని, తక్షణం మృతి చెందిన కార్మికురాలి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. వరుస ప్రమాదాలు జరుగుతున్న యాజమాన్యం కానీ ప్రభుత్వం గానీ తగు చర్యలు తీసుకోకపోవడం అత్యంత దారుణమన్నారు. పరిశ్రమల్లో తనిఖీలు లేకపోవడం, సరైన రక్షణ చర్యలు తీసుకోకపోవడం ప్రమాదాలకు కారణమని పేర్కొన్నారు. ఒకపక్క కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతూ మరోపక్క పరిశ్రమల నిర్వహణ, భద్రతా చర్యలు యాజమాన్యాలకు వదిలిపెట్టడం ప్రభుత్వాలకు అలవాటుగా మారిందని విమర్శించారు. ప్రభుత్వాలు తీసుకున్న ఈ వైఖరి కారణంగా కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఏనాడూ కార్మికులతో అధికారులు మాట్లాడింది లేదని, కనీసం సమస్యలు చెప్పుకోవడానికి కూడా అధికారులు అందుబాటులో లేకుండా ఉన్నారని పేర్కొన్నారు. తక్షణమే ప్రమాదాలకు నివారణ చర్యలు చేపట్టడంతో పాటు పరిశ్రమల్లో అధికారులు తనిఖీలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పరిశ్రమలు, ప్రమాణాలు పాటించని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మిక సంఘాలతో జిల్లా స్థాయిలో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని, అన్ని పరిశ్రమల్లోనూ ఇఎస్ఐ, పిఎఫ్, కార్మిక చట్టాల అమలుకు జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రైలు ఢీకొని యుటిఎఫ్ నేత మృతి

ప్రముఖుల సంతాపం


చిన్నసోమరాజు(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రైలు ఢీకొని యుటిఎఫ్ నేత, రిటైర్డ్ ఉపాధ్యాయులు పెన్మత్స చిన్నసోమరాజు(68) బుధవారం ఉదయం మృతిచెందారు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతపర్రు గ్రామానికి చెందిన చిన్నసోమరాజు ఉపాధ్యాయులుగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. అనంతరం గ్రామంలోని రైల్వే ట్రాక్ వెంబడి ఉన్న తనపొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఎప్పటిలాగానే ఉదయం పొలానికి వెళ్లిన ఆయన పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందారు.

1985లో రెగ్యులర్ ఉపాధ్యాయునిగా జిన్నూరుపాలెం ప్రాథమిక పాఠశాలలో తన ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించారు. పాలకొల్లు, పెనుగొండ, పోడూరు మండలాల్లోని పాఠశాలల్లో పనిచేశారు. 2019లో శాసనసభ్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు ద్వారా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కూడా అందుకున్నారు. టిసి సెంటర్ కార్యదర్శిగా, మండల రిసోర్స్‌పర్సన్‌గా తన విలువైన సేవలందించారు. చివరిగా జిన్నూరుపాలెం యుపి స్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా 2016లో ఉద్యోగ విరమణ చేశారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కుమార్తెలకు వివాహాలు అయ్యాయి. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా విశేష సేవలందించారు. ఆ సమయంలో ఉపాధ్యాయ సమస్యలపై చేపట్టిన ఉద్యమాల్లో కీలకభూమిక పోషించారు.

సోమరాజు మృతికి ఎంఎల్‌సి షేక్ సాబ్జీ సంతాపం తెలిపారు. ఆయన మరణం ఉపాధ్యాయ రంగానికి, విద్యార్థులకు తీరని లోటన్నారు. పనిపట్ల ఆయన అంకిత భావంతో పనిచేసేవారని కొనియాడారు. అనేక ఉద్యమాల్లో పాల్గొని ఎన్నో ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించారన్నారు. పోడూరు, పెనుగొండ, పాలకొల్లు మండలాల్లో జరిగిన యుటిఎఫ్ కార్యక్రమాల్లో ప్రధాన భూమిక పోషించి, విస్తృత సేవలను అందించారన్నారు. సోమరాజు మృతి బాధాకరమని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి అన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాల్లో పాల్గొన్నారని తెలిపారు. యుటిఎఫ్ అభ్యున్నతికి విశేషమైన కృషి చేశారన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతిని తెలిపారు. సోమరాజు మృతి యుటిఎఫ్ ఉద్యమాలకు తీరని లోటు అని యుటిఎఫ్ జిల్లా నేత కె.రాజశేఖర్ అన్నారు. పోడూరు, పాలకొల్లు, పెనుగొండ మండలాల్లో యుటిఎఫ్ బలోపేతానికి సోమరాజు కృషి చేశారన్నారు.

భౌతికంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం

విద్యుత్ నియంత్రణ మండలి విద్యుత్ ఛార్జీల పెంపుపై ప్రజాభిప్రాయ సేకరణను ఆన్‌లైన్‌లో కాకుండా భౌతికంగా నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ ఛార్జీలపై కోవిడ్ ఆంక్షలు లేని సమయంలో ప్రజాభిప్రాయ సేకరణ ఆన్‌లైన్‌లో నిర్వహించడమంటే తూతూ మంత్రంగా నిర్వహించినట్లేనన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ గతంలో వలే భౌతికంగా ఎక్కువమంది ప్రజానీకం పాల్గొనేలా బహిరంగంగా, విస్తృతంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2023-24 సంవత్సరం రూ.13 వేల కోట్ల లోటును చూపించి ప్రజలమీద భారాలు వేయడానికి సిద్ధమవుతోందని విమర్శించారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీల వసూళ్లతో సామాన్య ప్రజలు కట్టకోలేక నానాఅవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాలు వేసే ఆలోచనను ప్రభుత్వాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గతప్రభుత్వం ప్రజలపై వేసిన విద్యుత్ భారాల వల్ల పెద్దఎత్తున ప్రజా ఉద్యమం జరిగిందని, దీంతో పదేళ్లపాటు అధికారానికి దూరమైందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాలు వేయడానికి ప్రభుత్వాలు సన్నద్ధమైతే పెద్దఎత్తున ప్రజలను సమీకరించి మరో ప్రజా ఉద్యమాలు చేయడానికి సన్నద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 2023-24 సంవత్సరం లోటు రూ.13 వేల కోట్లు ప్రభుత్వమే సబ్సిడీగా ఇవ్వాలని బలరాం డిమాండ్ చేశారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించ కూడదని, నివాసాలకు, వ్యాపార సంస్థలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనను విరమించుకోవాలని, ట్రూ అప్ ఛార్జీల విధానాన్ని రద్దు చేయాలని, ప్రతినెల విద్యుత్ ఛార్జీలను సవరించాలనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపా దనను ఉపసం హరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో అనేక గ్రామాల్లో విద్యుత్ వైర్లు, స్తంభాలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయని వాటి మరమ్మతులు తక్షణం చేపట్టి పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ప్రమాదాల్లో నష్టపోయిన గొర్రెలు, మేకల పెంపకందార్లకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, ప్రాణాలు కోల్పోయిన వారికి ఎక్స్‌గ్రేషియా అందించాలని బలరాం ప్రభుత్వాన్ని కోరారు.

పెరుగులంక భూములు పేదలకే చెందాలి

గోదావరిలో జల దీక్ష


గోదావరిలో జల దీక్షలో పాల్గొన్న పేదలు

ప్రజాశక్తి - యలమంచిలి

పెరుగులంక భూములు తమకే చెందాలని, ప్రభుత్వ అధికారులు లంకభూముల్లో మట్టిని తవ్వి ఇతర ప్రాంతాలకు తరలించడానికి చేస్తున్న ప్రయత్నాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ చించినాడ గ్రామానికి చెందిన పేదలు బుధవారం గోదావరిలో జల దీక్ష చేపట్టారు. వీరికి సంఘీభావంగా పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నరసాపురం మండలం రాజులంక నుంచి సిద్ధాంతం వరకూ గోదావరిని ఆనుకొని వేల ఎకరాల్లో పెరుగులంక భూములు భూస్వాములు, ఇతర రైతాంగం ఆధీనంలో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా చించినాడలో పేదలకిచ్చిన డి ఫారం పట్టా భూములకు ఆనుకొని ఏర్పడిన పెరుగులంక భూముల్లో గత 25 సంవత్సరాలుగా పేదలు సుమారు 300 మంది ఈ భూమిని వివిధ రూపాలలో సేద్యం చేసుకుంటూ కొద్దో గొప్పో జీవనాధారం పొందుతున్నారని తెలిపారు. ఈ భూములకు ఇరువైపులా ఏర్పడిన భూముల్లో రైతులు రొయ్యల చెరువులను సాగు చేసుకుంటున్నారని, పెద్దల ఆధీనంలో ఉన్న భూములను వదిలి కేవలం చించినాడ గ్రామంలోనే పేదల ఆధీనంలో ఉన్న భూముల నుండే మట్టిని తరలించాలనే ఆలోచన ప్రభుత్వ అధికారులకు రావడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. పేదల పొట్టగొట్టే చర్యలను ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు విరమించుకోవాలని లేనిపక్షంలో ప్రజాసంఘాలను కలుపుకొని ఐక్య పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం పేదలంతా మట్టిని తవ్వడానికి అధికారులు తీసుకొచ్చిన ప్రొక్లెయిన్‌ను లంక నుండి బయటకు పంపించి వేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు, రైతు సంఘం నాయకులు కేతా సూర్యారావు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు కానేటి బాలరాజు, యువజన సంఘం నాయకులు చెల్లుబోయిన వడ్డికాసులు, మల్లుల పుల్లారావు, మురాల రాజేష్, విప్పర్తి నాని, శెట్టిమి భాస్కరరావు, పల్లేరు వెంకటస్వామి, కోరం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జనసేన ఓటు బ్యాంకును చీల్చేందుకు కుట్ర : హరిరామజోగయ్య

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎపిలో జనసేన ఓటుబ్యాంకును చీల్చేందుకు కాపు సామాజిక తరగతికి చెందిన తోట చంద్రశేఖర్‌రావును రాష్ట్రంలో నియమించి వైసిపికి లబ్ధి చేకూర్చేందుకు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి, కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకులు చేగొండి హరిరామజోగయ్య ఆరోపించారు. వైసిపి వ్యతిరేక ఓట్లను జనసేనకు, టిడిపికి పడకుండా బిఆర్ఎస్ పార్టీకి కొంతమేర పడేలా చేయడం ద్వారా జనసేన, టిడిపిలను నష్టపర్చడం కెసిఆర్ ఎత్తుగడలో భాగమేనని బుధవారం ఆనను కలిసిన మీడియాకు చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ అధినేత ఆంధ్రాకు బద్ధవిరోధి అని అన్నారు. అవినీతిపరుడైన జగన్ ప్రమేయంతో కెసిఆర్ తెలంగాణలో ఉన్న ఇక్కడి ప్రభుత్వ ఆస్తులు, సెక్రటేరియేట్, ఢిల్లీలో ఉన్న ఆంధ్రాభవన్‌లోని వాటాలను కాజేశారన్నారు. విభజన చట్టంలోని హామీల ప్రకారం తెలంగాణ నుండి ఆంధ్రా ప్రభుత్వానికి రావాల్సిన నిధులను అందించక పోవడం, కృష్ణానది పరివాహక సంగమేశ్వర ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకోవటం ద్వారా రాయలసీమకు దక్కాల్సిన సాగు, తాగునీటిని అడ్డుకోవడం, పోతిరెడ్డిపాడు హెడ్‌క్వార్టర్స్ నుండి ఆంధ్రావైపు వస్తున్న కాలువలను వెడల్పు చేసేందుకు చేసిన ప్రభుత్వ ప్రయత్నాన్ని అడ్డుతగలడం, రాజోలిబండ ఆనకట్ట నుండి ఆంధ్రాకు రావాల్సిన కృష్ణానది నీటిని రాకుండా చేయడం ద్వారా రాయలసీమ ప్రజలకు అన్యాయం చేస్తున్నారని చెప్పారు.


రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

18 నుంచి జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు


జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకూ 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, అదనపు ఎస్‌పి సుబ్బరాజు, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి టి.ఉమా మహేశ్వరరావుతో కలిసి 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాహనా దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, దీని ద్వారా ప్రయాణ సమయంలో తలకు గాయం కాకుండా, మరణాలు సంభవించకుండా ఆపగలమని తెలిపారు. రవాణా శాఖ అధికారులు కళాశాలకు వెళ్లి విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 10 వరకూ ట్యాక్సీ, బస్సు, లారీ వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించాలని తెలిపారు. వాహనాలకు రేడియం స్టిక్కర్లను అతికించాలని తెలిపారు. రోడ్డు కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్లను తొలగించాలని, దీనిద్వారా ప్రమాదాలను నివారించగలమని తెలిపారు. డిటిసి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నాసిరకం హెల్మెట్‌లను వాడడం వల్ల లాభం లేదని, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రకారం ఐఎస్ 4151 ఉన్నదే వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి టి.ఉమామహేశ్వరరావు, సంబంధిత శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజల్లో సంతోషం

ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జగనన్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం కనిపిస్తోందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మండలంలోని కడియద్ద గ్రామంలో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మంత్రి కొట్టు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు. ఏ ఇంటికి వెళ్లినా జగనన్న సంక్షేమ పథకాల ఫలాలు అందుకుంటూ ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమూ, ఏ ముఖ్యమంత్రీ ఇంత పెద్ద మొత్తంలో సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక లబ్ధి చేకూర్చలేదని ప్రజలే స్వయంగా చెబుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో మరలా వైసిపి అధికారంలోకి రావాలని కోరారు. చంద్రబాబును ఎలాగైనా ముఖ్యమంత్రిని చేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పనిచేస్తుంటే పవన్‌ను అడ్డుపెట్టుకుని కాపులు ఓట్లు కొల్లగొట్టాలని చంద్రబాబు కుట్ర చేస్తున్నారన్నారు. చంద్రబాబుకు అధికార దాహం అయితే, పవన్ కళ్యాణ్‌కు ధన దాహం ఉందన్నారు. ఈ ఇద్దరూ కలిసి వచ్చే ఎన్నికలలోపు మరిన్ని జిమ్మిక్కులు చేస్తారని తెలిపారు. ప్రజలు సంతోషంగా ఉండడం వీరికి గిట్టడం లేదన్నారు. ప్రజలు జగన్‌కు అనుకూలంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, ఎంపిపి పి.శేషులత, కొమ్ముగూడెం సొసైటీ ఛైర్మన్ వెలిశెట్టి నరేంద్ర కుమార్, ఎంపిడిఒ సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ముగిసిన డివైఎఫ్ఐ క్రీడా పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఎల్‌సి షాబ్జీ

ప్రజాశక్తి - ఆకివీడు

పది రోజులుగా ఆకివీడులో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరుగుతున్న 40వ సంక్రాంతి ఆటల పోటీలు మంగళవారం రాత్రితో ముగిశాయి. యువజన ఉత్సవాల ఆహ్వాన సంఘ కమిటీ అధ్యక్షులు ఎమ్‌డి మహమ్మద్ ఈ సభకు అధ్యక్ష వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఎల్‌సి షాబ్జీ, డివైఎఫ్ఐ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానోత్సవం చేశారు. ఈ సారి మహిళా వాలీబాల్ పోటీలకు అత్యధిక ప్రాధాన్యతిచ్చారు. పాల్గొన్న ఐదు మహిళా వాలీబాల్ టీముల్లో నలుగురు బహుమతులు గెలుచుకున్నారు. వాటిలో జిల్లా క్రీడాకారులు మొదటి బహుమతి గెలుచుకున్నారు. రెండో బహుమతి విశాఖపట్నం టీమ్, మూడో బహుమతి కర్నూలు టీమ్, 4వ బహుమతి పశ్చిమగోదావరి జూనియర్స్ టీమ్ గెలుచుకున్నాయి. పురుషుల విభాగంలో కొట్టాడ టీమ్ మొదటి స్థానం గెలుచుకోగా, రెండో బహుమతి దీన గూడెం, మూడో బహుమతి తాడినాడ, నాలుగో బహుమతి ఆకివీడు ఎఎస్ఎన్ రాజు టీమ్ గెలుచుకుంది. చెడుగుడు పోటీల్లో ఏలూరుపాడు ప్రథమ స్థానం పొందగా, అయి భీమవరం ఢిల్లీ ఫ్రెండ్స్ రెండో బహుమతి, మూడో బహుమతి కైకలూరు నరేష్ టీములు గెలుచుకున్నాయి. ఆశాంతం పోటీలు మంచి రసవత్తరంగా సాగాయి.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి


ప్రమాదంలో మృతి చెందిన రైతు వెంకట్రావు

ప్రజాశక్తి - పెనుమంట్ర

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం నత్తారామేశ్వరం పంపనవారిపాలెం పెట్రోల్ బంకు సమీపంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నత్తారామేశ్వరం శివారు పంపనవారిపాలెంకు చెందిన రైతు వేండ్ర వెంకట్రావు (61) తణుకులో నివాసం ఉంటున్నాడు. రోజూ వెంకట్రావు వ్యవసాయం చేసేందుకు స్వగ్రామం వస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం వెంకట్రావు ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. పంపనవారిపాలెం సమీపంలోకి వచ్చేసరికి ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురు యువకులు మద్యం మత్తులో వెంకట్రావు బైక్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో వెంకట్రావు అక్కడికక్కడమే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహాలు జరిగాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తెలిపారు.

నేటి నుంచి ఓటుపై అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ నుంచి జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి డిఆర్ఒ దాసి రాజు తెలిపారు. వీటికి సంబంధించిన బ్రోచర్లను బుధవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషనన్ ఆదేశాల మేరకు ప్రతీ సంవత్సరం జనవరిలో జాతీయ ఓటర్ల దినోత్సవం దేశవ్యాప్తంగా నిర్వహిస్తారని, ఓటు హక్కుపై పూర్తిఅవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమాలను శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ రంగసాయి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం దానికి కళాశాలల, పాఠశాలల ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, లయన్స్ క్లబ్ వంటి స్వచ్ఛంద సేవా దళాలు సహకరిం చడం గొప్ప విషయమన్నారు. రంగసాయి మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ నుండి విద్యాసంస్థల్లో ఓటు హక్కు అవగాహన ర్యాలీలు, సదస్సులు, రెవెన్యూ అధికారుల సహకారంతో నిర్వహి స్తున్నామన్నారు. జనవరి 25న ప్రభుత్వ కార్యక్రమంతో పాటు తాము కూడా పాల్గొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు కంతేటి వెంకట్రాజు, నందమూరి రాజేష్, వివిధ కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, ఎన్‌సిసి ఆఫీసర్లు పి.అమూల్యారావు, వినోద్, సత్యనారాయణ, గంగాధర్ మాట్లాడారు.

పాలిలో సచివాలయం, ఆర్‌బికె ప్రారంభం


ప్రజాశక్తి - అత్తిలి

ప్రజలకు, రైతులకు అవసరమైన అన్ని సేవలందించేందుకు ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను నిర్మిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, పౌర సరఫరాల శాఖా మంత్రి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని పాలి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను వారు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల ద్వారా ప్రజలకు అవసరమైన సేవలు అందించడంతోపాటు, అంగన్వాడీ కేంద్రం ద్వారా పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జెవి.మురళి, ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దార్, ఎంపిడిఒ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ బదిలీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు మున్సిపల్ కార్యాలయానికి చేరాయి. సామర్లకోటకు చెందిన శేషాద్రి ప్రమోషన్‌పై గ్రేడ్-1 అధికారిగా పాలకొల్లు మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. 3 సంవత్సరాలకుపైగా ప్రమోద్ కుమార్ పాలకొల్లు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. మున్సిపల్ కౌన్సిల్ కూడా లేకపోవడంతో ఆయన కమిషనర్‌గా ఉన్నారు.



మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం పెనుమంట్రలోని రజకుల ఏరియాలో గ్రామ అధ్యక్షుడు తేతలి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), ఉపసర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, నాయకులు గాదిరాజు సాయి రామరాజు, గురువు సర్పంచి ముదునూరి నాగరాజు, తాడిపర్తి ప్రసన్న, తహశీల్దార్ దండు వెంకట సత్యసూర్య అశోక్ వర్మ, ఎంపిటిసిలు, సీనియర్ నాయకులు పెనుమత్స విశ్వనాథరాజు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు

ప్రజాశక్తి - ఉండి

వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడున్నర సంవత్సరాల్లో చేసిన అభివృద్ధి శూన్యమని మాజీ శాసనసభ్యులు వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. ఉండిలో జరిగిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఒక్క ఛాన్స్ ఇవ్వండి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని కల్లబొల్లి కబుర్లు చెప్పిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకూ చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. విద్యుత్ బిల్లును కొలమానంగా తీసుకుని అర్హులకు సంక్షేమ పథకాలను తొలగిస్తున్నారని విమర్శించారు. నవరత్నాల పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. అనంతరం గత ప్రభుత్వంలోని నిత్యావసర సరుకుల ధరలను, నేటి ప్రభుత్వ హయాంలోని నిత్యావసర సరుకుల ధరల వ్యత్యాసాన్ని చూపించే కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కాగిత వెంకట సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, నాయకులు జుత్తిగ శ్రీనివాస్, కందుల బలరాం, దూసనపూడి రాంబాబు, కరిమెరక శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాతాజీ చిత్రపటం అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ చేస్తున్న సేవలను గుర్తించి కృతజ్ఞతాభావంతో తాతాజీ చిత్రపటాన్ని ప్రముఖ చిత్రకారుడు ఉదయ్ గీసి బుధవారం తాతాజీ కార్యాలయంలో అందజేశారు. ఉదయ్ అంతర్జాతీయ స్థాయిలో ఎందరో ప్రముఖుల చిత్రపటాలను రూపొందించి వివిధ దేశాల్లో ప్రదర్శించారు. కళారూపాలు చిత్రీకరించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఉదయ్‌కుమార్ తెలిపారు. మార్లపూడి ఉదయకుమార్‌ను సత్కరించి తాతాజీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేలంగి శ్రీను, త్సవటపల్లి కృష్ణమోహన్, తలుపూరి భుజంగారావు, పిల్లా శ్రీను, దిద్దే చిట్టిబాబు, చోడగిరి రమేష్‌బాబు, వజ్రపు కిరణ్ పాల్గొన్నారు.

కార్గో సేవలు మరింత విస్తృతం

ప్రజాశక్తి - తణుకు

ఆర్‌టిసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్గో సేవలను మరింతగా విస్తరిస్తున్నట్లు తణుకు డిపో మేనేజర్ పిఎన్‌వి ఎం.సత్యనారాయణమూర్తి అన్నారు. కార్గో కార్యాలయంలో వినియోగదారుల సౌకర్యార్థం పార్సిల్, కొరియర్స్ డెలివరీ కోసం నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయంలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 కేజీల్లోపు పార్సల్‌కు పది కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీ, డిజిటల్ పేమెంట్స్ సౌకర్యం కూడా అందుబాటులో ఉందని అలాగే పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తుల సౌకర్యం వెయ్యి కేజీల వరకూ డిక్కీ బుకింగ్, బల్క్ బుకింగ్, రోప్ టాప్ బుకింగ్ వంటి సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. 8, 10 టన్నుల సరుకు రవాణాకు ప్రత్యేక సరుకు రవాణా బస్సు కూడా కల్పిస్తామని తెలిపారు. అన్ని ప్రయివేటు ట్రాన్స్‌పోర్టుల కన్నా తక్కువ ఖర్చుతో సౌకర్యం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి.ధనమ్మ, బివికె.రావు, సూపరింటెండెంట్ రమణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ శేఖర్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు అందజేత


ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పెదగరువు ప్రాథమిక పాఠశాలలో బుధవారం మంతెన అప్పారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాంపండు, మనవలు 65 మంది వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. వారిని పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నిల్లా సురేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు..



వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న రాంపండు

పేదల అభ్యున్నతికి ఎన్‌టిఆర్ కృషి



ఉండి : వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న ఎంఎల్ఎ రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

పేదల అభ్యున్నతికి ఎన్‌టిఆర్ కృషి మరువలేనిదని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. పెదఅమిరంలో ఎన్‌టిఆర్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఎంఎల్ఎ మంతెన రామరాజు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుండా బత్తుల వెంకట నాగేశ్వరరావు, తోట ఫణిబాబు, బండారు వేణుగోపాలరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : భీమవరం టిడిపి కార్యాలయంలో మండల అధ్యక్షుడు రేవు వెంకన్న ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నందమూరి అభిమాన సంఘాల నాయకులు పడమట సోమేశ్వరరావు, చిరుకూరి రామకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. చేపలబజార్ సెంటర్లో లంకి చిన్ని ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మహిళలకు బియ్యం పంపిణీ చేశారు. వీరమ్మ చెరువు బివి రాజ్ పార్కు వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం తెలుగుయువత ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ప్రారంభించారు. అనంతరం టిడిపి సీనియర్ నాయకుడు మద్దుల రాము ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. అలాగే సీతారామలక్ష్మీ మాట్లాడారు. అలాగే రక్తదానం చేసినవారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమాల్లో మహిళా విభాగం నుండి మాదాసు కనకదుర్గ సయ్యద్ నసిమాబేగం, ఎమ్‌డి షబీనా, బి.పద్మ పాల్గొన్నారు.

ఉండి : ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో గ్రామ అధ్యక్షులు కాగిత వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు హాజరై మాట్లాడారు. తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేసిన మహోన్నత వ్యక్తి ఎన్‌టిఆర్ అన్నారు. ఎఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, జుత్తిగ శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం వృద్ధులు, మహిళలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షులు పెన్మెత్స బాలరాజు, ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, క్లస్టర్ ఇన్‌ఛార్జి గురుగుబిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుమంట్ర: ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసిన వారు ఎన్‌టిఆర్ అని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. బుధవారం ఎన్‌టిఆర్ 27వ వర్ధంతి సందర్భంగా ఓడూరులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మార్టేరులోని లక్ష్మీనరసింహ కళ్యాణ మండపంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 70 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి (బుల్లాలు), ఆచంట జెడ్‌పిటిసి సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు , ఆచంట ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు వెలగల బులిరామిరెడ్డి పాల్గొన్నారు.

ఆచంట : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నందమూరి తారక రామారావు ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కందరవల్లి, కరుగోరుమిల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు, అయోధ్యలంక గ్రామాల్లో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడారు. మండల అధ్యక్షులు కేతా మీరయ్య. నాయకులు బీరా నరసింహమూర్తి, తమ్మినీడి ప్రసాద్, మానేపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకొల్లు : పేద, బడుగు, బలహీన వర్గాలకు ఎన్‌టిఆర్ ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ ఆదర్శమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు చెప్పారు. గాంధీబొమ్మ సెంటర్లో టిడిపి నేతలు బుధవారం ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి వద్ద రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గండేటి వెంకటేశ్వరరావు, కోడి విజయభాస్కర్, పాలవలస తులసీరావు పాల్గొన్నారు.

పెనుగొండ : మండలంలోని టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడలి, సిద్ధాంతం, ఇలపర్రు, గ్రామాల్లో ఎన్‌టిఆర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు

వీరవాసరం : వీరవాసరం తూర్పు చెరువు సెంటర్లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు రూపకల్పన చేసిన ఘనత ఎన్‌టిఆర్‌కు దక్కుతుందని టిడిపి మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు అన్నారు. మత్స్యపురిలో పార్టీ గ్రామాధ్యక్షుడు చింత కనకయ్య ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో వీరవల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచి పి.నాని పాల్గొన్నారు.


తణుకు : ఎన్‌టిఆర్ వర్ధంతి టిడిపి ఆధ్వర్యంలో తణుకులో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వర థియేటర్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి శ్రేణులు నివాళులర్పించారు. అనంతరం లెజెండ్రీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ ద్వారా టిడిపి కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకటరత్నం, గుబ్బల శ్రీనివాస్, నల్ల భాస్కరరావు, తోట సూర్యనారాయణ పాల్గొన్నారు.

నరసాపురం : మండలంలో ఎన్‌టిఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కొప్పాడి రవీంద్రనాధ్ ఠాగూర్ (రవి) మాట్లాడారు. మహోన్నత వ్యక్తి ఎన్‌టిఆర్ అన్నారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ, కార్యదర్శి కొల్లు పెద్దిరాజు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్లు అధికారి అనంత రామారావు, పొన్నాల నాగబాబు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని గాంధీబొమ్మ సెంటర్లో టిడిపి మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కలిదిండి కుమార్‌బాబు, కొల్లాటి బాలరాజు, పొన్నపల్లి శివ, డల్లా రత్నంరాజు, మామిడిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.
2. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న తెదేపా నాయకులు.

పాలకోడేరు : ఆంధ్రుల ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు అని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. పాలకోడేరులో మండల అధ్యక్షులు దెందుకూరు ఠాగూర్ కోటేశ్వరరాజు (కోటిరాజు) ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతికి ఎన్‌టిఆర్ పాటు పడ్డారన్నారు. టిడిపి గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : పూలపల్లిలో ఎన్‌టిఆర్ వర్ధంతిని నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు కోడి విజయభాస్కర్ ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ స్థాపించిన ఆరు నెలల్లో అధికారంలోకొచ్చిన మహోన్నత వ్యక్తి ఎన్‌టిఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సెక్రటరీ పాముల రజనికుమార్, గ్రామ అధ్యక్షులు శ్రీహరిరాజు, కార్యదర్శి గుబ్బల ప్రసాద్ పాల్గొన్నారు.



నరసాపురంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



పూర్వపు విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - భీమవరం

వారంతా తాము చదువుకున్న కళాశాలలో తిరిగి 15 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. 2004 - 2007 సంవత్సరం వరకూ ఆర్‌ఆర్ డీఎస్ కళాశాలలో డిగ్రీ చదువుకున్నారు. 2007 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించుకున్నారు. తొలుత తమకు విద్య నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా తాము ఏ రంగాల్లో స్థిరపడ్డారో వాటికి సంబంధించిన వివరాలను ఒకరికొకరు పంచుకున్నారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. తాము చదువుకున్న కళాశాలకు ఏదైనా సహాయం చేయాలని ఈ సందర్భంగా వారు నిర్ణయించుకున్నారు.

ముగిసిన ముగ్గులు, ఆటల పోటీలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పొలమూరులోని కలిదిండి సూర్యనారాయణ రాజు జన విజ్ఞాన కళా వేదిక వద్ద నిర్వహించిన ముగ్గులు, ఆటల పోటీలు మంగళవారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ సహాయ కార్యదర్శి చింతపల్లి మావో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో సుమారు 300 మంది పాల్గొన్నారని తెలిపారు. స్లో సైక్లింగ్‌లో 70 మంది, మ్యూజికల్ ఛైర్స్‌లో 93 మంది, గోనె సంచి నడకలో 25 మంది, రన్నింగ్ రేస్‌లో 40 మంది, లెమన్ అండ్ స్పూన్ పోటీలో 45 మంది, స్కిప్పింగ్‌లో 63 మంది పాల్గొన్నారని తెలిపారు. స్కిప్పింగ్ పోటీల్లో భార్గవి 2 నిమిషాల్లో 248 స్కిప్పింగ్ చేసి రికార్డు సాధించిందన్నారు. కొండకొట్టుడులో 20 మంది పాల్గొన్నారని తెలిపారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా ఉండాలంటే ఇలాంటి సంక్రాంతి యువజనోత్సవాలు జరగాలన్నారు. ప్రభుత్వం గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. పొలమూరు డివైఎఫ్ఐ కమిటీకి 35 సంవత్సరాలు యువజనోత్సవాలు నడిపినందుకు అభినందనలు తెలిపారు.

రైతులకు సత్కారం



రైతులను సత్కరించిన సభ్యులు

రైతులకు సత్కారం..

యువజనోత్సవాల సందర్భంగా రైతులను ఘనంగా సత్కరించారు. ఇంజె ఇజ్రాయిల్, పురిటి వినాయకం, ఇందుకురి ఆంజనేయరాజు, పిచ్చెట్టి నాగరాజు, పిచ్చెట్టి సుబ్బారావును సత్కరించారు. అనంతరం 30 ఏళ్ల పాటు పంచాయతీ పారిశుధ్య కార్మికుడిగా పనిచేసి రిటైర్ అయిన బండారు రామును సత్కరించారు. ముగింపు సభకు చింతపల్లి మావో అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కాకర రాజేశ్వరరావు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు చింతపల్లి ప్రసాద్‌రావు, కుల వివక్షత పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపుడి సుబ్బరాజు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కేతా పద్మజ, వ్యవసాయ కార్మిక రైతు సంఘం గ్రామ బాధ్యులు చింతపల్లి తిరుమలరావు, బాలల సంఘం జిల్లా అధ్యక్షుడు రిషి, బహుజన కులాల సంచార జాతుల రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

గొరగనమూడి ప్రజల ఆప్యాయత మరువలేనిది

కార్తికేయ-2 డైరెక్టర్ చందు

ప్రజాశక్తి - పాలకోడేరు

కార్తికేయ-2 సినిమా దర్శకుడు చందు మొండేటి గొరగన మూడిలో బుధ వారం సందడి చేశారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచి చెల్లబోయిన పాపారావు ఇంటికి ఏటా సంక్రాంతికి దర్శకుడు చందు మొండేటి వస్తుంటారు. దీనిలో భాగంగా మాజీ సర్పంచి పాపారావు ఇంటికి విచ్చేసిన దర్శకుడు చందు మొండేటికి సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీ రాజు), విసాకోడేరు సర్పంచి బొల్ల శ్రీనివాస్, గొరగనముడి గ్రామస్తులు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక ముత్యాలమ్మ మహంకాళి అమ్మ ఆలయాన్ని దర్శకుడు చందు సందర్శించారు. అనంతరం గ్రామస్తులు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం చందు మాట్లాడుతూ గొరగనముడి గ్రామంతో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. తన సోదరుడు మాజీ సర్పంచి పాపారావు తనకు ఆప్తమిత్రుడని, ఏటా సంక్రాంతి పండుగకు ఇక్కడికి రావడం ఎంతో ఆనందనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు దొంగ సురేష్, బల్ల పరమేశ్వరరావు, చేబోలు రామకృష్ణ, సూర్యనారాయణ రాజు, దిడ్ల రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.



దర్శకుడు చందుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సర్పంచి శివాజీరాజు, మాజీ సర్పంచి పాపారావు, గ్రామస్తులు

ఘనంగా ముత్యాలమ్మ జాతర

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు గ్రామ దేవత నడివీధి ముత్యాలమ్మ అమ్మవారి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. జాతరలో యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వర్తక సంఘం, ప్రజల ఆధ్వర్యంలో చక్కెర పొంగలి, అన్నవరం ప్రసాదం, బూందీ, పులిహోర, లడ్డు, కదంబం, దద్ధోజనం, కట్టుపొంగళి వంటి ప్రసాదాలను యాత్రికులకు అందజేశారు. కార్యక్రమంలో ఉద్దగిరి బుజ్జి, రమేష్, అద్దేపల్లి హనుమంతరావు, పువ్వాడ, శ్రీను, శివ, సీమకుర్తి పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి రూ.ఐదు లక్షలు కేటాయించండి

ప్రజాశక్తి - ఉండి

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణానికి 5 లక్షల రూపాయలు కేటాయించి, మౌలిక సౌకర్యాలు కల్పించాలని సిపిఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు డిమాండ్ చేశారు. బుధవారం ఉండిలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం జగనన్న గృహ లబ్ధిదారులను కలిసి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. లబ్ధిదారుల గృహ నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ చేపట్టిన పోరుబాట కరపత్రాలను పంపిణీ చేశారు. లబ్ధిదారులచే సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు తమ్మరాని శ్రీనివాస్, కోన గొల్లయ్య, కొడవర్తి రమేష్, పెద్దింటి సింహాచలం పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పేకాట స్థావరాలపై దాడి

15 మంది అరెస్టు

ప్రజాశక్తి - ఉండి

కోలమూరు గ్రామ శివారు చేపల చెరువుల వద్ద మంగళవారం అర్ధరాత్రి పోలీసులు పేకాట స్థావరాలపై దాడి చేసి 15 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1,02,000 రూపాయల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.గంగాధరరావు తెలిపారు